సాక్షి
నిర్మల్
బుధవారం । 20 । సెప్టెంబర్ । 2023

సిక్కిం నుంచి పొన్కల్‌కు..



మతస్థిమితం లేని మహిళను స్వచ్ఛంద సంస్థ 8 ఏళ్ల తర్వాత ఇంటికి చేర్చిం ది. కుటుంబ సభ్యులకు మం గళవారం అప్పగించింది.

8లో▸

నిధులు ఆపేహక్కు మీకెక్కడిది?



తన నియోజకవర్గ నిధులను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నిలిపివేయిం చారని ఎమ్మెల్యే రేఖానాయక్ ఆరోపించారు. వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

8లో▸

గరిష్టం/కనిష్టం
32.4/24.4

వాతావరణం

ఆకాశం చాలావరకు మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. రుతుపవనాలు, తుపాను ప్రభావంతో చాలా ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కేటీఆర్ పర్యటనకు ఏర్పాట్లు



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

సోన్: మండలంలోని పాక్‌పట్ల గ్రామంలో ఈనెల 25న రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ పర్యటించనున్నారు. ఆయిల్‌పాం ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేయనున్నారు. ఈమేరకు చేస్తున్న ఏర్పాట్లను జిల్లా పాలనాధికారి వరుణ్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. అధికారులకు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్‌రెడ్డి, ఎంపీడీవో మోహన్‌రెడ్డి, ఎంపీవో ఖలీల్ డీఎస్పీ ఆర్‌అండ్‌బీ అధికారులు, గంగారెడ్డి, సీఐ నవీన్‌కుమార్, ఎస్సై రవీందర్, ఏవో వినోద్‌కుమార్, ఏఈవోలు ఉన్నారు.

నేడు ప్రిఫరెన్షియల్ కేటగిరీ ఉపాధ్యాయులకు వైద్య పరీక్షలు

నిర్మల్ రూరల్: ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా ప్రిఫరెన్షియల్ కేటగిరీ కింద దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులకు జిల్లా కేంద్రంలోని నూతన వైద్య కళాశాలలో బుధవారం వైద్య పరీక్షలు నిర్వహిస్తారని డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మెడికల్ బోర్డు వైద్య బృందంతో రీఎగ్జామినేషన్ చేపడుతామన్నారు. జిల్లాలో ప్రిఫరెన్షియల్ కేటగిరీ కింద మొత్తం 110 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో పీహెచ్‌సీ కేటగిరీలో–10, క్యాన్సర్–19, ఓపెన్‌హార్ట్ సర్జరీ–10, న్యూరో–6, కిడ్నీ డయాలసిస్–4, వితంతువులు–22, విడాకులు–4, ఇతర కేటగిరీలో–9 మంది బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరందరికీ పది పాయింట్లు అదనంగా లభిస్తాయి. అయితే ఈ దరఖాస్తుల్లో అవకతవకలు జరిగాయని డీఈవో, కలెక్టర్‌కు చాలా వరకు ఫిర్యాదులు అందినట్లు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. దీంతో కలెక్టర్ వరుణ్‌రెడ్డి దిద్దుబాటు చర్యలు చేపట్టారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఒకరోజు అవకాశం ఇవ్వగా.. అందులో నుంచి 17 మంది తమ దరఖాస్తులను వెనక్కి తీసుకున్నారు. మిగిలిన వారికి బుధవారం జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాలలో ఉదయం 10 గంటలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు.

విడతల వారీగా వెబ్ ఆప్షన్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న రాజేశ్‌నాయక్

కడెం: ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియలో భాగంగా ఎస్జీటీలకు వెబ్ కౌన్సెలింగ్‌లో విడతల వారీగా వెబ్ ఆప్షన్లు ఇవ్వాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భుక్యా రాజేశ్‌నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో మంగళవారం మాట్లాడారు. సాంకేతికంగా లోపాలు, పొరపాట్లు జరిగినా, ఒక ప్లేస్ బదులుగా మరొక ప్లేస్ వచ్చినా ఏలాంటి పైరవీలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఉపాధ్యాయులు భిక్షపతి, మోహన్, సందీప్‌నాయక్ పాల్గొన్నారు.

రోగులతో ఏరియా ఆస్పత్రి కిటకిట



ఓపీ కౌంటర్ వద్ద క్యూలో నిలబడిన రోగులు

భైంసాటౌన్: పట్టణంలో జ్వర బాధితులు పెరుగుతున్నారు. చిన్న పిల్లలు మొదలు పెద్దల వరకు వైరల్ జ్వరాల బారిన పడుతున్నారు. దీంతో పట్టణంలోని ప్రభుత్వ ఏరియాస్పత్రి తోపాటు పలు ప్రైవేట్ ఆస్పత్రులు జ్వర బాధితులతో కిటకిటలాడుతున్నాయి. ఏరియా ఆస్పత్రిలో మంగళవారం ఒక్కరోజే 812 ఓపీ నమోదైందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. రోగులు ఓపీ కౌంటర్ వద్ద క్యూలో అవస్థలు పడ్డారు. ఇన్ పేషెంట్లకు సైతం పడకలు సరిపోక ఒక్కో మంచంపై ఇద్దరు, ముగ్గురిని ఉంచి చికిత్స అందిస్తున్నారు.



ఒకే బెడ్‌పై ఇద్దరు, ముగ్గురికి చికిత్స..

కొలువుదీరిన ఆదిదేవుడు



వినాయక చవితి సందర్భంగా సకల విఘ్నాలను తొలగించి.. సకల శుభాల్ని కలిగించే దేవగణాల గురువు విఘ్నాధిపతి వినాయకుడు భక్తుల జయ జయ ధ్వానాల నడుమ మండపాల్లో కొలువుదీరాడు. ఐదు అడుగుల నుంచి 30 అడుగుల ఎత్తు వరకు ఉన్న విగ్రహాలను ప్రతిష్ఠించారు. సోమ, మంగళవారాల్లో ప్రత్యేక పూజలందుకున్నాడు. తొమ్మిదిరోజుల పాటు ఉత్సవాలు ఉత్సాహంగా సాగనున్నాయి. తానూరు మండలంలోని భోసి గ్రామంలో నెలకొల్పిన కర్ర వినాయకుని దర్శించుకునేందుకు మంగళవారం భక్తులు బారులు తీరారు. ఆలయంలో ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. నిర్మల్‌లోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన కర్ర వినాయకుడికి మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తొలిపూజ చేశారు. అంతకుముందు తన నివాసంలో ప్రతిష్ఠించిన గోమయ గణపతికి కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేశారు. – సాక్షి ఫొటోగ్రాఫర్/నిర్మల్‌టౌన్/నిర్మల్ ఖిల్లా/తానూరు



భైంసా రూరల్ : మహాగాంలో కొలువుదీరిన గణనాథుడికి హారతి ఇస్తున్న భక్తులు



లోకేశ్వరం : అబ్దుల్లాపూర్‌లో కర్ర గణపతికి పూజలు చేస్తున్న భక్తులు


పర్యావరణ హిత.. సెల్ఫీ విత్ గణేశ్



నిర్మల్‌టౌన్: పర్యావరణాన్ని కాపాడే రీతిలో, విభిన్న ఆకృతుల్లో అపార్ట్‌మెంట్లు, యువజన సంఘాలు, ఇళ్లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక గణేశులకు సంబంధించి 'సాక్షి' పర్యావరణ హిత.. సెల్ఫీ విత్ గణేశ్ పేరిట ఫొటోలను ఆహ్వానిస్తోంది. వినాయక ప్రతిమలతో తీసుకున్న సెల్ఫీ ఫొటోలను బుధవారం సాయంత్రం 4గంటల వరకు **98482 86206** నంబరుకు వాట్సాప్‌లో పంపించాలి.

గణేశ్ మండలి పేరు, ఇంట్లో అయితే మీ పేరు, గ్రామం, మండలం వివరాలు పంపించాలి.

చట్ట సభలకు ఆమె



- మహిళా రిజర్వేషన్ బిల్లుపై జిల్లా మహిళల హర్షం
- రాజకీయంగా రాణిస్తామంటున్న అతివలు
- అవకాశాలు కల్పించడాన్ని స్వాగతిస్తున్న నేతలు

వివరాలు.. 2011 లెక్కల ప్రకారం..

జిల్లా జనాభా	7,09,418
పురుషులు	3,46,712
మహిళలు	3,62,697
లింగనిష్పత్తి	1,046
వర్కింగ్ వుమెన్	1,82,890
మహిళా రైతులు	40,148
మహిళా రైతుకార్మికులు	59,575
పారిశ్రామిక కార్మికులు	50,387
ఇతర కార్మికులు	32,780

తాజా ఓటర్ల జాబితా ప్రకారం..

నియోజకవర్గం	పురుష	మహిళ	ట్రాన్స్ జెండర్	సర్వీస్ ఓటర్లు	మొత్తం
నిర్మల్	1,12,612	1,24,706	14	243	2,37,575
ముధోల్	1,15,000	1,20,840	18	272	2,36,130
ఖానాపూర్	1,03,222	1,06,490	13	418	2,10,143
మొత్తం	3,30,834	3,52,036	45	933	6,83,848

నిర్మల్: తల్లిగా, చెల్లిగా, ఆలిగా కుటుంబాన్ని బాధ్యతగా నడిపిస్తున్న అతివకు పాలకురాలిగా అవకాశం రాబోతోంది. చట్టసభల్లో హక్కుగా ప్రాతినిధ్యం లభించబోతోంది. చట్టాలు చేసే చాన్స్ దక్కబోతోంది. ఇందుకు మార్గం సుగమమవుతోంది. మూడు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లుపై మళ్లీ కదలిక వచ్చింది. నూతన భవనంలోకి మారిన ప్రస్తుత పార్లమెంట్‌లో ఈ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించేలా కేంద్రం అడుగులు వేస్తోంది. కొత్త పార్లమెంట్ భవనం సాక్షిగా కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం 'నారీశక్తి వందనం' చేస్తోంది. ఈ మేరకు మహిళా రిజర్వేషన్ బిల్లును లోక్‌సభలో మంగళవారం ప్రవేశపెట్టారు. అన్ని పార్టీలు మహిళా రిజర్వేషన్ కావాలని పట్టుపడుతున్న నేపథ్యంలో పార్లమెంట్ ఆమోదానికి పెద్దగా ఆటంకాలు ఉండవని భావిస్తున్నారు. ఈక్రమంలో అతివల ఖిల్లాగా పేరున్న నిర్మల్ జిల్లా మహిళాలోకం హర్షం వ్యక్తం చేస్తోంది. కట్టుబాట్లను దాటుకుని కలలను సాకారం చేసుకునే దిశగా ఎదుగుతున్న మహిళలు ఇకపై రాజకీయాల్లో రాణించే హక్కు ఈ బిల్లు ఆమోదంతో దక్కనుంది. మహిళా బిల్లు అమలులోకి వచ్చిన తర్వాత లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలలో మూడింట ఒకవంతు (33శాతం) సీట్లు మహిళలకే రిజర్వు కానున్నాయి.

ఆమె అధికం..

స్త్రీ, పురుష జనాభా నిష్పత్తిపరంగా చూస్తే రాష్ట్రంలోనే నిర్మల్ జిల్లా అధిక మహిళా నిష్పత్తితో ప్రథమ స్థానంలో ఉంది. ఓటర్ జాబితాలోనూ 'స్త్రీశక్తి' ఆధిక్యతను చాటుతోంది. జిల్లాలో 2011 లెక్కల ప్రకారం మొత్తం జనాభా 7,09,418. ఇందులో పురుషులు 3,46,721 ఉండగా, మహిళలు 3,62,697 మంది ఉన్నారు. ఈ లెక్కన 15,976 మంది మహిళలు ఎక్కువగా ఉన్నారు. లింగ నిష్పత్తి పరంగా చూస్తే ప్రతీ వెయ్యి మంది పురుషులకు 1,046 మంది మహిళలు ఉన్నారు. రాష్ట్రంలోనే జిల్లా అధిక లింగనిష్పత్తితో అగ్రస్థానంలో ఉంది. 2011 తరువాత వారి సంఖ్య మరింతగా పెరిగింది. ఇటీవల విడుదల చేసిన తుదిజాబితా ప్రకారం జిల్లాలో మొత్తం 6,83,848 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 3,30,834 మంది ఉండగా, మహిళా ఓటర్లు 3,52,036 మంది ఉన్నారు. అంటే పురుష ఓటర్ల కంటే దాదాపు 22 వేల మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు.

కాంగ్రెస్ కారణంగానే..



ఇప్పటికైనా మహిళా బిల్లు ఆమోదం దిశగా రావడం హర్షనీయం. మహిళలకు రాజకీయంగా అవకాశం కల్పించింది కాంగ్రెస్సే. స్థానిక సంస్థల్లో 50 శాతమిచ్చి ఎంతోమంది మహిళలను పాలకులుగా మార్చింది.

– దుర్గాభవాని, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు

రాజకీయాల్లోనూ రాణించాలి..



అవకాశమిస్తే అన్నిరంగాల్లోనూ మహిళలు రాణించగలరు. మహిళా బిల్లు అమలులోకి వస్తే రాజకీయాల్లోనూ మరింతగా మహిళలు రాణిస్తారు. మోదీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– భూక్య జానుబాయి, పెంబి జెడ్పీటీసీ

ఇన్నేళ్లకయినా..



మహిళబిల్లు అనేది ఏళ్లుగా పెండింగ్‌లో ఉంది. ఇన్నేళ్లకయినా ఆమోదం లభించనుంది. ఇది నిజంగా మహిళలు హర్షించదగిన అంశం. అన్నిరంగాలతోపాటు రాజకీయాల్లోనూ మహిళలు రాణించాలి.

– కొరిపెల్లి విజయలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్

అభివృద్ధికి ఆస్కారం..



తన కుటుంబాన్ని ఎలాగైతే బాధ్యతగా చూసుకుంటుందో, రాజకీయాల్లో అవకాశమిస్తే అంతే బాధ్యతగా సమాజ అభివృద్ధి కోసం మహిళ కృషిచేస్తుంది. అభివృద్ధి మరింతగా జరుగుతుంది.

– అల్లోల దివ్యారెడ్డి, క్లిమోమ్ గోశాల వ్యవస్థాపకురాలు

మహిళలకు మోదీ పట్టం..



దేశాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం మరింత పెరగాలన్న లక్ష్యంతో కేంద్రంలో మోదీ ప్రభుత్వం అతివలకు పట్టం కడుతోంది. ఈక్రమంలో కొత్త పార్లమెంట్‌లో తొలి బిల్లుగా ఆమోదం తెలుపడం హర్షనీయం.

–పదకంటి రమాదేవి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు

బడి పిల్లలకు అల్పాహారం

- సీఎం కేసీఆర్ దసరా కానుక
- ఒకటి నుంచి 10వ తరగతి వరకు వర్తింపు
- పేద విద్యార్థులకు ఉపయోగకరం
- హర్షం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు



నిర్మల్ రూరల్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం దసరా కానుకను ప్రకటించింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు దసరా నుంచి 'ముఖ్యమంత్రి అల్పాహార పథకం' ప్రారంభించనున్నట్లు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి వాకాటి కరుణ ప్రకటించారు. ఈ మేరకు జీవో సైతం జారీ చేశారు. 1 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులందరికీ ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. విద్యార్థులకు ఉచిత బోధనతోపాటు మంచి పౌష్టికాహారం అందించే దిశగా ఈ పథకం అమలు చేయనున్నారు. తద్వారా నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంతోపాటు వారికి చదువుపై ఏకాగ్రత మరింత పెరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంతో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు ఇకపై వారి ఇంట్లో ఒక్క పూట భోజనం మాత్రమే తింటారు.

దసరా నుంచి ప్రారంభం...

ప్రభుత్వం ప్రకటించిన ముఖ్యమంత్రి అల్పాహార పథకం విద్యార్థులకు అక్టోబర్ 24 నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభం కానుంది. దేశంలోనే మొదటిసారిగా ఈ అల్పాహార పథకాన్ని తమిళనాడు ప్రభుత్వం ప్రారంభించింది. ఆ పథకం అమలవుతున్న విధి విధానాలను పరిశీలించడానికి రాష్ట్ర ఉన్నతాధికారులు ఇటీవలే తమిళనాడుకు వెళ్లి వచ్చారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నివేదిక అందించారు. అక్కడ కేవలం ప్రాథమిక పాఠశాలల్లోనే ఈ పథకం అమలు చేస్తుండగా, మన రాష్ట్రంలో మాత్రం 1 నుంచి 10వ తరగతి వరకు ఒకేసారి అమలు చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు.

ఇదీ మెనూ....

దసరా నుంచి విద్యార్థులకు అందించే అల్పాహార మెనూ ప్రభుత్వం ఖరారు చేసింది. రవ్వ ఉప్మా, పొంగల్, కేసరి, కిచిడి వంటి పదార్థాలతో కూడిన మెనూ అధికారులు పరిశీలించి అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. పల్లి చట్నీ, సాంబార్ సైతం విద్యార్థులకు అందించనున్నారు. ప్రస్తుతం ప్రత్యామ్నాయ పోషకాహారంగా అందిస్తున్న రాగి జావ, ఉడికించిన కోడిగుడ్ల పంపిణీ యథాతథంగా కొనసాగుతుందని విద్యాశాఖ అధికారులు తెలిపారు. పాఠశాల ప్రారంభానికి ముందే రాగిజావను అందించనుండగా, మధ్యాహ్న భోజనానికి–రాగిజావాకు మధ్యలో అల్పాహారం అందజేస్తారు. మధ్యాహ్న భోజనం ప్రతీరోజు 2 గంటల తర్వాత అందించే ఆలోచన చేస్తున్నారు.

పేద విద్యార్థులకు ఉపయోగకరం..

ప్రభుత్వం తలపెట్టిన అల్పాహార పథకం ద్వారా జిల్లాలోని పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం కానుంది. జిల్లాలో 735 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 1 నుంచి 10వ తరగతి వరకు 52,667 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరందరికీ తాజా పథకం కింద లబ్ధి చేకూరనుంది. జిల్లాలో చాలామంది పేద పిల్లలు గ్రామీణ ప్రాంతాల నుంచి ఉదయం ఖాళీ కడుపుతో బడులకు వస్తున్నారు. ఫలితంగా వారిని రక్తహీనత, పోషకాహార లోపం సమస్యలు బాధిస్తున్నాయి. కొందరు విద్యార్థులు తరగతి గదిలోనే నీరసంతో చదువుపై అనాసక్తిగా కనిపిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వం రాగిజావ అందజేయడంతోపాటు, మధ్యాహ్న భోజన మెనూలో వెజిటేబుల్ బిర్యాని సైతం అందజేస్తుంది. తాజాగా అల్పాహారం అందించేందుకు నిర్ణయం తీసుకోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులతోపాటు ఉపాధ్యాయ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

పకడ్బందీగా చేపడుతాం..

విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రకటించిన అల్పాహార పథకం జిల్లాలో పకడ్బందీగా చేపడుతాం. ఈ విధానం పేద విద్యార్థులకు వరం లాంటిది. విద్యార్థుల్లో పౌష్టికాహార లోపం తీరుతుంది. ప్రభుత్వ బడుల్లో ఇప్పటికే రాగిజావ, నా ణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నాం.

– రవీందర్‌రెడ్డి, డీఈవో

సజావుగా పీజీహెచ్‌ఎంల బదిలీలు



బాధ్యతలు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

నిర్మల్ రూరల్: జిల్లాలో ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ సజావుగా కొనసాగుతోంది. మొదటగా పీజీ హెచ్‌ఎంల బదిలీల ప్రక్రియ సోమవారం ముగిసింది. జిల్లాలో 37 మంది హెచ్‌ఎంలు వారికి కేటాయించిన వివిధ పాఠశాలల్లో సోమవారం జాయిన్ అయ్యారు. మల్టీ జోన్ పోస్టు కావడంతో 30 మంది నిర్మల్ జిల్లాలో పోస్టింగ్ పొందగా, నలుగురు ఇతర జిల్లాల నుంచి నిర్మల్ జిల్లాకు వచ్చారు. ముగ్గురు ఇతర జిల్లాలకు వెళ్లారు. బదిలీల్లో తర్వాతి ప్రక్రియ అయిన స్కూల్ అసిస్టెంట్లకు పీజీహెచ్‌ఎంలుగా ప్రమోషన్ కోసం విద్యాశాఖ అధికారులు ఇప్పటికే సీనియార్టీ లిస్టును ప్రకటించారు. అభ్యంతరాలను ఈనెల 21లోపు అందజేయాలి. 22న ఆప్షన్లు పెట్టుకోవాలి. ప్రక్రియ మొత్తం పారదర్శకంగా నిర్వహిస్తామని డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు.

ఐటీడీఏ ఉపాధ్యాయుల బదిలీలు నిర్వహించాలి

నిర్మల్ రూరల్: ఐటీడీఏ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు వెంటనే నిర్వహించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మాజీ చందనే ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నో ఏళ్లుగా బదిలీలు, పదోన్నతులు లేక ఉపాధ్యాయులు సతమతమవుతున్నారన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీలతోపాటు ఐటీడీఏ ఉపాధ్యాయుల బదిలీలు కూడా చేపట్టాలని కోరారు.

హెచ్‌ఐవీ పరీక్షలు పెంచాలి



ఐసీటీసీని తనిఖీ చేస్తున్న జై సేతు మాధవ్

నిర్మల్‌చైన్‌గేట్: సంపూర్ణ సురక్ష హెచ్‌ఐవీ ఎయిడ్స్ క్యాంపెయిన్ అవగాహన కార్యక్రమంలో భాగంగా జిల్లాలో హెచ్‌ఐవీ నివారణకు విస్తృతంగా పరీక్షలు చేయాలని, అవగాహన కల్పించాలని ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఉమ్మడి జిల్లా బాధ్యుడు సేతు మాధవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రసూతి ఆసుపత్రి, ఖానాపూర్ ఆసుపత్రుల్లో ఐసీటీసీ కేంద్రాలను మంగళవారం తనిఖీ చేశారు. హెచ్‌ఐవీ నమోదవుతున్న ప్రాంతాలను గుర్తించి అవగాహన పెంచాలన్నారు. పరీక్షలు రెట్టింపు చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఐసీటీసీ కౌన్సిలర్లు సుదర్శన్, రామచందర్, శ్రీనివాస్, ల్యాబ్ టెక్నీషియన్లు రమేశ్‌రెడ్డి, సాజిద్ ఉన్నారు.

కేటీఆర్ వద్దకు జిల్లా నాయకుల క్యూ..



కేటీఆర్‌తో ఐకేరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

నిర్మల్‌టౌన్/మామడ/ముధోల్ : జిల్లాకు చెందిన వివిధ మండలాల బీఆర్‌ఎస్ నాయకులు ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ వద్దకు క్యూ కట్టారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో కేటీఆర్‌ను కలిశారు. తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. టీయూఎఫ్ఐడీఎస్ ద్వారా నిర్మల్ పట్టణ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని నిర్మల్ మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ కోరారు. స్పందించిన కేటీఆర్ తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా రూ.50 కోట్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. వారి వెంట ఎమ్మెల్సీ దండే విఠల్, ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ఉన్నారు. పొన్కల్‌ను మండలంగా ప్రకటించాలని మామడ మండల నాయకులు రాంకిషన్‌రెడ్డి, హరీశ్‌కుమార్, ఏనుగు లింగారెడ్డి మంత్రి కేటీఆర్‌ను కలిసి కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించారని, పొన్కల్‌ను మండలంగా చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. ముధోల్ మండల నాయకులు కూడా కేటీఆర్‌ను కలిశారు. నియోజకవర్గ రాజకీయాలపై చర్చించారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో బాసర జెడ్పీటీసీ సావ్లీ రమేశ్, ఎంపీపీ విశ్వనాథ్‌పటేల్, మాజీ ఎంపీపీ సాయిబాబా, ముధోల్ సర్పంచులు విజేష్, దూమానాయక్, రవికుమార్ ఉన్నారు.

అసమ్మతి నేతలతో చర్చలు

భైంసాటౌన్: ముధోల్ అభ్యర్థిని మార్చాలని కొంతకాలంగా డిమాండ్ చేస్తున్న అసమ్మతి నాయకులు మంత్రి కేటీఆర్‌ను కలిశారు. పార్టీలో అంతర్గత సమస్యలు ప్రతిచోటా ఉంటాయని, అభ్యర్థి గెలుపు కోసం సమష్టిగా పనిచేయాలని సూచించినట్లు తెలిసింది. అభ్యర్థి మార్పు ఉండదని క్లారిటీ ఇచ్చినట్లు సమాచారం. ఏవైనా సమస్యలుంటే ఒకరినొకరు చర్చించుకోవాలని, లేనిపక్షంలో తన దృష్టికి తేవాలని పేర్కొన్నట్లు నాయకులు తెలిపారు.

రోడ్లు ఊడ్చి ఎస్‌ఎస్‌ఏ కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన

నిర్మల్ రూరల్: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట 23 రోజులుగా దీక్ష చేస్తున్న సర్వ శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు మంగళవారం రోడ్లను ఊడ్చి తమ నిరసన వ్యక్తం చేశారు. మహిళా ఉద్యోగులు చంటి పిల్లలను సైతం ఎత్తుకుని సమ్మెకు హాజరయ్యారు. ప్రభుత్వం వెంటనే తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. పనికి తగిన వేతనం ఇవ్వాలన్నారు. పీఆర్సీ అమలు చేయాలని కోరారు.



రోడ్లు ఊడుస్తున్న ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు

క్లుప్తంగా

రెండు సెల్‌ఫోన్ల చోరీ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణం మహాలక్ష్మివాడలోని చింతర్ కృష్ణకు చెందిన రెండు సెల్‌ఫోన్‌లు సోమవారం రాత్రి చోరీకి గురయ్యాయి. టూటౌన్ సీఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణ తన ఇంట్లో నిద్రపోతున్న సమయంలో రెండు ఫోన్‌లను చార్జింగ్ పెట్టాడు. ఉదయం 4గంటల సమయంలో చిల్కూరి లక్ష్మినగర్‌కు చెందిన సమీర్ అనే వ్యక్తి ఎత్తుకెళ్లినట్లు గమనించాడు. టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపాడు.

రైతుబజార్‌లో..

పట్టణంలోని కూరగాయలు కొనుగోలు చేసేందుకు వెళ్లిన వినియోగదారుడి సెల్‌ఫోన్ చోరీకి గురైన ఘటన జిల్లా కేంద్రంలోని రైతు బజార్‌లో మంగళవారం చోటుచేసుకుంది. మావల మండల కేంద్రానికి చెందిన బండారి శ్రీనివాస్ కూరగాయలు కొనుగోలు చేసే క్రమంలో గుర్తు తెలియని వ్యక్తి సెల్‌ఫోన్ చోరీకి పాల్పడ్డాడు ఐఎంఈ నంబర్లతో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లుగా బాధితుడు పేర్కొన్నారు.

ధనోర పల్లెదవాఖానకు ఎన్‌క్వాస్ గుర్తింపు

తాంసి: భీంపూర్ మండలంలోని ధనోర పల్లె దవాఖానకు ఎన్‌క్వాస్ (నేషనల్ క్వాలిటీ ఆస్యూరెన్స్ స్టాండర్డ్) గుర్తింపు లభించింది. ఇప్పటికే భీంపూర్ ఆరోగ్య కేంద్రం పరిధిలోని అందర్‌బంద్, అర్లి(టి) పల్లె దవాఖానాలు రెండు నెలల క్రితం ఎన్‌క్వాస్ గుర్తింపును సాధించాయి. తాజాగా ధనోర పల్లె దవాఖానా సైతం గుర్తింపు సాధించడంతో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి. ధనోర పల్లె దవాఖానాను ఎన్‌క్వాస్ బృందం సభ్యులు ఆగస్టు 18వ తేదీన పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. ధనోర ఆరోగ్య ఉపకేంద్రం 85శాతం మార్కులు సాధించి ఎన్‌క్వాస్ గుర్తింపునకు అర్హత సాధించింది. ఈ గుర్తింపు ద్వారా పల్లె దవాఖానాలో మరిన్ని వసతులు కల్పనకు ప్రత్యేకంగా నిధులు అందనున్నాయి. ఆరోగ్య ఉపకేంద్రం ఎన్‌క్వాస్ గుర్తింపు సాధించడం ద్వారా వైద్యాధికారి నిఖిరాజ్, వైద్య సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తప్పిపోయిన చిన్నారుల అప్పగింత

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆస్పత్రిలో తప్పిపోయిన ఇద్దరు చిన్నారులను రిమ్స్ అవుట్‌పోస్టు పోలీసులు వారి తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. పట్టణానికి చెందిన వారు సోమవారం ఉదయం తల్లిదండ్రులతో కలిసి ఆస్పత్రికి వచ్చారు. ఇద్దరు చిన్నారులు ఏడుస్తూ స్థానికులకు కనిపించారు. వారు అవుట్‌పోస్టు పోలీసులకు ఈ విషయాన్ని తెలియజేయడంతో ఇద్దరు పిల్లలను కానిస్టేబుల్ వెంకటి తమ వద్ద ఉంచి తల్లిదండ్రుల కోసం గాలించి వారికి అప్పగించారు.

నెట్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు శిరీష


శిరీష

కుంటాల: జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు మండలంలోని అంబకంటి తండాకు చెందిన కె.శిరీష ఎంపికై నట్లు నెట్‌బాల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్.అనిల్ కుమార్, జి.మోహన్ తెలిపారు. ఇటీవల నిర్మల్ జిల్లాలో 6వ తెలంగాణ నెట్‌బాల్ చాంపియన్ షిప్ రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈనెల 22 నుంచి 26వరకు హర్యానా రాష్ట్రంలో జరిగే 41వ నెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా పెటా సంఘం బాధ్యులు బుక్య రమేష్, భోజన్న, రమణరావు, జమున, భూమన్న, గంగాధర్ ఆమెను అభినందించారు.

ఇరువురిపై అట్రాసిటీ కేసు

జన్నారం: కులం పేరుతో దూషించి, బెదిరించిన వ్యక్తిపై మంగళవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. ఈ నెల 13న జన్నారం మండలం రేండ్లగూడ గ్రామానికి చెందిన మురిమడుగుల దస్తగిరిని అదే గ్రామానికి చెందిన బాల్తా రాజమౌళి, బాల్తా సంతోష్ కులం పేరుతో దూషించారు. ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

హత్యకేసులో జీవిత ఖైదు

ఆసిఫాబాద్: మద్యం మత్తులో డబ్బులకోసం హత్యకు పాల్పడిన వాంకిడి మండలం కేడేగాంకు చెందిన ఆత్రం బొజ్జిరావుకు జీవిత ఖైదుతో పాటు రూ.లక్ష జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ మంగళవారం తీర్పు చెప్పారు. జరిమానాలోని రూ. 50 వేలు మృతుని కుటుంబానికి చెల్లించాలన్నారు. లైజన్ అధికారి మహ్మద్ బషీర్ తెలిపిన ప్రకారం వివరాల ప్రకారం. వాంకిడి మండలం సర్కేపల్లికి చెందిన తండ్రీకొడుకులు కోవ జలపతిరావు, కోవ మాణిక్‌రావు జనవరి1, 2020న పత్తి అమ్మగా రూ.30 వేలు వచ్చాయి. డబ్బులు తీసుకుని వాంకిడి నుంచి ఆటోలో ఇంటికి బయలుదేరారు. అప్పుడే అక్కడికి వచ్చిన ఆత్రం బొజ్జిరావు బైక్‌పై జలపతిని తీసుకెళ్లాడు. మార్గమధ్యంలో మద్యం కొనుగోలు చేసి పత్తి చేనులో సేవించారు. జలపతిరావు మత్తులోకి వెళ్లడంతో బొజ్జిరావు అతని తలపై బండరాయితో మోది హతమార్చాడు. అతని వద్దనున్న రూ.30 వేలు తీసుకుని పారిపోయాడు. మృతుని కుమారుడు మాణిక్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

ఆదర్శ కళాశాల

- ఐఐటీ, ఎన్ఐటీలో రాణిస్తున్న విద్యార్థులు
- జాతీయ స్థాయి యూనివర్సిటీల్లో సైతం
- ఇటీవల రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రథమ ప్రిన్సిపల్‌గా అవార్డు


టేకం సాయికిరణ్‌ను అభినందిస్తున్న అప్పటి ఐటీడీఏ పీవో (ప్రస్తుత నిర్మల్ జిల్లా కలెక్టర్) వరుణ్‌రెడ్డి


ఉత్తమ ప్రిన్సిపల్‌గా అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపల్ శ్రీనివాస స్వామి

ఆదిలాబాద్‌రూరల్: గిరిజన విద్యార్థులు వసతి గృహాల్లో, గురుకులాల్లో ఉంటూ పదో తరగతి, ఇంటర్మీడియేట్ వరకు చదివి ఉన్నత చదువులు చదువుకోలేక మధ్యలోనే అనేక మంది మానేస్తున్నారు. దీంతో ప్రభుత్వం 2017–18 విద్యా సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా 22 డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాలలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగానే జిల్లా కేంద్రంలో తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల (బోథ్)ను ఏర్పాటు చేసింది. ప్రారంభ విద్యా సంవత్సరంలో బీఏ (హెచ్ఈపీ), బీకాం (జనరల్), బీఎస్సీ (ఎంపీసీ), బీజెడ్‌సీ గ్రూపులతో ప్రవేశాలకు అవకాశం కల్పించింది. 80మంది విద్యార్థులతో ప్రారంభమై ప్రస్తుతం 350మంది ప్రతీ విద్యా సంవత్సరం విద్యను అభ్యసిస్తూ వంద శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రస్థాయిలోనే మొదటిస్థానంలో నిలుస్తోంది.

జాతీయ స్థాయి యూనివర్సిటీలకు ఎంపిక...

దేశ వ్యాప్తంగా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన కేరళ, తమిళనాడు, రాజస్థాన్, పాండిచ్చేరి, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్‌ల్లో పీజీలో సీట్లు సాధించి ఆదిలాబాద్ జిల్లా పేరును జాతీయస్థాయిలో నిలుపుతున్నారు ఇక్కడి గిరి విద్యార్థులు. 2017–18 విద్యా సంవత్సరం నుంచి గత విద్యా సంవత్సరం వరకు 40మంది విద్యార్థులు ఆయా రాష్ట్రాలోని విశ్వవిద్యాలయాల్లో వివిధ సబ్జెక్ట్‌ల్లో పీజీ సీట్లు సాధించి ఉన్నత చదువులు చదువుతున్నారు.

అథ్లెటిక్‌లో మంచి గుర్తింపు..

గిరిజన డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాలలో చదువుతున్న 20మంది విద్యార్థులు అథ్లెటిక్ ఫుట్‌బాల్, వాలీబాల్, తదితర క్రీడల్లో జాతీయ స్థాయిలో సైతం రాణించారు. మరో విద్యార్థి జాతీయ స్థాయి క్రికెట్‌లో సైతం రాణించిన సందర్భాలు ఉన్నాయి.

ఉద్యోగాల్లో ముందంజలో..

అక్కడ విద్యాభ్యాసం చేసిన పలువురు విద్యార్థులు వివిధ ఉద్యోగాల్లో రాణిస్తున్నారు. ఫార్మా కంపెనీలో 11మంది, ఆర్మీలో నలుగురు, బీఎస్ఎఫ్‌లో మరో నలుగురు విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. అంతేకాకుండా సాంకేతిక రంగంలో సైతం రాణిస్తున్నారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న విద్యార్థులను ఆదర్శంగా తీసుకుని మరికొంత మంది రాణించేలా తీర్చిదిద్దుతున్నారు.

ఈజిప్టు దేశానికి ఇద్దరు విద్యార్థులు..

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ట్రైబర్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలకు చెందిన జి.సురేందర్, టేకం సాయికిరణ్ అనే ఇద్దరు విద్యార్థులు గత ఏడాదిన్నర కిందట ఈజిప్టు దేశ విద్యా విధానాన్ని అధ్యాయనం చేయడానికి వెళ్లారు. అక్కడి విద్యా విధానంపై 45 రోజుల పాటు అధ్యాయనం చేశారు. వీరికి సంబంధించిన ఖర్చు మొత్తం ప్రభుత్వామే భరించింది.

ప్రత్యేక శిక్షణ

ట్రైబర్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ప్రతి రోజు మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు అక్కడి అధ్యాపకులు ప్రత్యేక శిక్షణను ఇస్తున్నారు. విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా శిక్షణను ఇవ్వడంతోనే ఆయా రంగాల్లో రాణిస్తున్నారని కళాశాల ప్రిన్సిపల్‌తో పాటు అధ్యాపకులు పేర్కొంటున్నారు.

బెస్ట్ ప్రిన్సిపల్‌గా అవార్డు..

కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించడంతో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస స్వామి ఇటీవం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యాశాఖ, హోంశాఖ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీ చేతుల మీదుగా రాష్ట్ర స్థాయి ప్రథమ అవార్డును అందుకున్నారు.

ప్రారంభం నుంచే ఐఐటీ, ఎన్ఐటీలో రాణింపు..

2017–18 విద్యా సంవత్సరంలో ప్రారంభమైన గిరిజన రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలకు చెందిన గిరిజన విద్యార్థులు వివిధ ఉన్నత కోర్సులకు ఎంపికవుతున్నారు. ప్రారంభ విద్యా సంవత్సరంలోనే ఐదురుగు విద్యార్థులు ఇండియన్ ఆఫ్ టెక్నాలజీ, మరో ఎనిమిది మంది విద్యార్థులు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ)లో రాణించారు. అలాగే మరికొంత మంది విద్యార్థులు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రాణించారు. దీంతో పాటు ఎంబీఏ, ఎంసీఏలలో సైతం అనేక మంది విద్యార్థులు రాణిస్తున్నారు.


ఎన్ఐటీ, ఎంబీఏ సాధించిన విద్యార్థులతో సెక్రటరీ రొనాల్డ్ రొస్

పోలీసులమని చెప్పి చైన్ స్నాచింగ్


పోలీసులు అనుమానిస్తున్న వాహనం

ఆదిలాబాద్‌టౌన్: పోలీసులమని చెప్పి బంగారు గొలుసు దొంగలు ఎత్తికెళ్లిన ఘటన మంగళవారం సాయంత్రం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. టూటౌన్ సీఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. జైనథ్ మండల కేంద్రానికి చెందిన రమ ఆమె బావతో కలిసి ద్విచక్ర వాహనంపై ఆదిలాబాద్ పట్టణానికి వచ్చింది. ఆమె బంధువులు ఆస్పత్రిలో ఉండడంతో వారిని చూసి తిరుగు పయనం అయ్యారు. ఈ క్రమంలో పట్టణంలోని జీఎస్ ఎస్టేట్ సమీపంలోని గణేష్ మందిర్ దాటిన తర్వాత ఇద్దరు వ్యక్తులు పల్సర్ బైక్‌పై వచ్చారు. తాము పోలీసులమని వారిని నమ్మబలికారు. ఈ రోడ్డు గుండా దొంగతనాలు జరుగుతున్నాయని, జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఆమె మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు గొలుసును సంచిలో వేయించారు. ఆమె బావ మోహన్ వద్దని చెప్పాడు. అతన్ని పక్కకు నెట్టివేసి ఆ సంచిని ఎత్తుకెళ్లి పరారయ్యారు. కాగా మోహన్ తలకు గాయమైంది. జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకొని టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు. అయితే ద్విచక్ర వాహనాన్ని గుర్తించినట్లు సమాచారం.

గర్భిణులకు గాయాలు

నిర్మల్‌రూరల్: నిర్మల్‌రూరల్ మండలంలోని చిట్యాల వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు గర్భిణులకు గాయాలయ్యాయి. రూరల్ ఎస్సై చంద్రమోహన్, స్థానికుల కథనం ప్రకారం... దిలావర్‌పూర్ మండలం కాల్వ తండా గ్రామానికి చెందిన శిరీష, సోను, శిల్ప, మోతిబాయి, సోనీ గర్భిణులు మంగళవారం తమ స్వగ్రామం నుంచి ఆటోలో జిల్లా కేంద్రంలోని ప్రసూతి ఆస్పత్రికి పరీక్షల నిమిత్తం వచ్చారు. అనంతరం స్వగ్రామానికి వెళ్తుండగా మండలంలోని చిట్యాల గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న కారు వీరి ఆటోను ఢీకొట్టగా వారికి గాయాలయ్యాయి. స్థానికులు వారిని ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించి ఇంటికి పంపించారు.

బీఆర్‌ఎస్‌లోనే ఉంటా...రెబల్‌గా పోటీ చేస్తా

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్


సర్పంచ్ కుసుంబాయితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఇంద్రవెల్లి: బీఆర్‌ఎస్‌లోనే ఉంటా... రెబల్‌గా పోటీ చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని అంజీ, దనోరా(బి) గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో ముందుగా గణేష్ మండపాల వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడి అభివృద్ధి పనులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాను బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేనని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులకు కావాల్సిన నిధులను అధికారులు ఆపడం సరైన పద్ధతి కాదన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్ తనపై ఎన్ని కుట్రలు చేసినా ఆగేది లేదని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు నియోజకవర్గానికి ఏమి చేశాడని, ఓట్లు అడిగే అధికారం జాన్సన్ నాయక్‌కు లేదన్నారు. ప్రజల కోసమే తన జీవితాన్ని అంకితం చేశానని తెలిపారు. తొమ్మిదేళ్లలో ఖానాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పోటీ శోభాబాయి, ఈశ్వర్‌నగర్ సర్పంచ్ శారదా, ఎంపీటీసీలు స్వర్ణలత, ఆశబాయి ఉన్నారు.

నీటిసంపులో పడి యువకుడి మృతి


జాదవ్ శేషారావ్ (ఫైల్)

తానూరు: నీటిని తోడుతుండగా ప్రమాదవశాత్తు మిషన్ భగీరథ నీటిసంపులో పడి యువకుడు మృతిచెందిన సంఘటన మంగళవారం మండలంలోని హిప్నెల్లితండాలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... హిప్నెల్లితండా గ్రామానికి చెందిన మచ్చేందర్, పారుబాయి దంపతుల పెద్ద కుమారుడు శేషారావ్(17) మంగళవారం తండ్రితో మందు కొట్టేందుకు వ్యవసాయ పొలానికి వెళ్లాడు. సమీపంలోని మిషన్ భగీరథ సంపు నుంచి నీటిని తోడుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి అందులో పడిపోయాడు. తండ్రి గమనించేలోగా మృతిచెంది కనిపించాడు. విషయం తెలుసుకున్న ఎస్సై సందీప్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

ముగిసిన యువకుల అంత్యక్రియలు


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జోగురామన్న

తాంసి: మహారాష్ట్రలోని అమరావతి జిల్లాలోని చిక్కల్‌ధార ఘాట్ సెక్షన్‌లో ఆదివారం ఉదయం వాహనం అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో అర్లి(టి) గ్రామ సర్పంచ్ గోల్లి రమ లస్మన్న కుమారుడు వైభవ్(28)తో పాటు అదే గ్రామానికి చెందిన వాహన డ్రైవర్ షేక్ సల్మాన్ (31) మృతిచెందిన విషయం తెలిసిందే. సోమవారం యువకుల మృతదేహాలను స్వగ్రామానికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. అందరితో కలివిడిగా ఉండే యువకులు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలియడంతో అంత్యక్రియల్లో పెద్దఎత్తున్న గ్రామస్తులు తరలివచ్చారు. అలాగే ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బీఆర్‌ఎస్ బోథ్ నియోజకవర్గ అభ్యర్థి అనిల్ జాదవ్, జెడ్పీటీసీ సుధాకర్, ఎంపీపీ సంతోష్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

దగ్గరుండి సాయమందించి..

మహారాష్ట్రలోని అమరావతి జిల్లా సమీపంలోని చిక్కల్‌ధార పర్యాటక ప్రాంతం దగ్గర జరిగిన ప్రమాదంలో బాధితులకు భీంపూర్ మండలంలోని కరంజి(టి) గ్రామానికి చెందిన ఏనుగు నవీన్‌రెడ్డి ఎంతో కృషి చేశారు. నవీన్‌రెడ్డి అమరావతిలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తెలంగాణకు చెందిన కారు ఆదివారం ఉదయం లోయలో పడిన విషయాన్ని వాట్సాప్ గ్రూప్ ద్వారా తెలుసుకొన్న నవీన్‌రెడ్డి వెంటనే ఘటన స్థలానికి చేరుకున్నాడు. ప్రమాద స్థలంలో పడి ఉన్నవారిని స్థానికుల సాయంతో అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి తరలించాడు. అక్కడి ఆస్పత్రిలో త్వరగా వైద్యసేవలు సైతం అందించే విధంగా తనవంతుగా చేయూత అందించాడు.

అనుమానాస్పదంగా ఒకరి మృతి


మహ్మద్ సుల్తాన్ (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలో ఒకరు అనుమానాస్పదంగా మృతిచెందిన ఘటన ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. టూటౌన్ సీఐ అశోక్ వివరాల ప్రకారం.. పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన మహ్మద్ సుల్తాన్ (26)కు ఆదివారం అర్ధరాత్రి 12.10 గంటలకు అష్రఫ్ అనే వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. రియల్ ఎస్టేట్‌కు సంబంధించి చర్చించేందుకు ఆయన ఇంటి నుంచి బైక్‌పై బయల్దేరి వెళ్లినట్లు కుటుంబీకులు పేర్కొన్నారు. గాంధీనగర్– ఇందిరానగర్ మధ్యలో సోమవారం తెల్లవారుజామున 3.30గంటల సమయంలో వాహనం ఢీకొనగా మృతిచెందినట్లు సీఐ పేర్కొన్నారు. మృతుడి భార్య ఫర్జాన తన భర్త రోడ్డు ప్రమాదంలో మరణించలేదని, ఎవరో హత్య చేసి ఉంటారని ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పెళ్లికి నిరాకరించిన ప్రియుడిపై కేసు

ఇచ్చోడ: పెళ్లికి నిరాకరించిన ప్రియుడు చందల హరీశ్‌తో పాటు అతడి తల్లిదండ్రులు చందల ముత్తన్న, ఇంద్రలక్ష్మిలపై మంగళవారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం... కడెం మండలంలోని ముసాయిపేట్ గ్రామానికి చెందిన సుజాత, ఇచ్చోడ మండల కేంద్రంలోని టీచర్ కాలనీకి చెందిన హరీశ్ కొంతకాలంగా ప్రేమించుకున్నారు. ప్రియుడు పెళ్లికి నిరాకరించడంతో 18 నెలల క్రితం ప్రియుడి ఇంటి ముందు ధర్నాకు దిగింది. దీంతో హరీశ్ కుటుంబంతో సహా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి సుజాత ఆ ఇంటిలోనే ఉంటుంది. అయితే ఈ నెల 17న పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించగా హరీశ్ పెళ్లికి నిరాకరించాడు. దీంతో సుజాత కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లారు. పోలీస్‌స్టేషన్ గేటు ఎదుట సుజాత పురుగుల మందుతాగింది. కుటుంబ సభ్యులు వెంటనే రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి హరీశ్‌తో పాటు అతడి తల్లిదండ్రులను రిమాండ్‌కు తరలించారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

పురుగుల మందు తాగి ఒకరు..

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రకు చెందిన ఒకరు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. టూటౌన్ సీఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకా గౌరి గ్రామానికి చెందిన ఆడె ఉమేష్ (43) అత్తారింటి గ్రామమైన ఘాటంజి తాలుకా చిరోలి గ్రామానికి వెళ్లి వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగి కేకలు వేయడంతో కుటుంబీకులు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. అదేరోజు రిమ్స్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తాగుడుకు బానిసై..

నిర్మల్‌రూరల్: మద్యానికి బానిసై ఒకరు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని వెంగ్వాపేట్ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది రూరల్ ఎస్సై చంద్రమోహన్ వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన అల్లకొండ గంగాధర్ (38) ఆరోగ్యం బాగా లేకపోవడంతో తాగుడికి బానిసయ్యాడు. పనిదొరకక, జీవితంపై విరక్తితో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఉరేసుకుని యువకుడు..


విష్ణువర్ధన్ (ఫైల్)

నేరడిగొండ: మండల కేంద్రంలోని అటవీ ప్రాంతంలో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన వడూర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై సాయన్న వివరాల ప్రకారం.. మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన మునిగొట్ట శోభకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన నర్సయ్యతో గతంలో వివాహమైంది. ఈ దంపతులకు కుమారుడు విష్ణువర్ధన్, కూతురు సంధ్య ఉన్నారు. ఎనిమిదేళ్ల క్రితం నర్సయ్య భార్య శోభను వదిలిపెట్టడంతో ఆమె తన పిల్లలతో పుట్టింట్లోనే ఉంటోంది. వీరి బాగోగులు చూసుకుంటున్న ఆమె తండ్రి పర్వతం శంకర్ అనారోగ్యానికి గురికావడంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించి శోభ తండ్రి వద్దే ఉంది. ఈ క్రమంలో ఆమె కుమారుడు విష్ణువర్ధన్ (17) నేరడిగొండ అటవీ ప్రాంతంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న తల్లి సంఘటన స్థలానికి చేరుకుని బోరున విలపించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

నిధులు ఆపే హక్కు మీకెక్కడిది?

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్
- అటవీ అనుమతుల కోసం మంత్రికి దండం పెట్టిన..
- సెక్యూరిటీ తొలగింపుపై ఆగ్రహం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఖానాపూర్: 'అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి నిధులు ప్రతీ ఎమ్మెల్యేకు చట్టబద్ధంగా వస్తాయి. వాటిని ఆపే హక్కు మీకెక్కడిది. నా కోటాలో రావాల్సిన నిధులను జిల్లా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నిలిపివేయించారు. నిధులు విడుదల చేయకుంటే ధర్నా చేస్తా.. అవసరమైతే దీక్షకు కూడా వెనుకాడను' అని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ హెచ్చరించారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు అటవీ అనుమతుల కోసం మంత్రికి దండం పెట్టినా స్పందించడం లేదని, తన నియోజకవర్గంలో మాత్రం అనుమతులు ఇచ్చుకున్నారని ఆరోపించారు. ఖానాపూర్‌లోని ఆమె నివాసంలో మాట్లాడారు. రూ.2.25 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎన్టీఆర్ చౌరస్తాలో ధర్నా చేస్తానని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ నిధులను కావాలనే నిలిపివేయిస్తున్నారని తెలిపారు. తాను బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేనని అయినా తన హయాంలో అభివృద్ధి జరగలేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు.

భద్రత తగ్గించారు..

తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ స్థానిక సీఐ తనను పట్టించుకోవడం లేదని, ఒక పోలీస్ అధికారి అయి ఉండి జాన్సన్‌నాయక్‌ను గెలిపించాలని ప్రచారం చేస్తున్నాడని ఆరోపించారు. ఇదివరకు తన ఇంటి వద్ద ఎస్బీ కానిస్టేబుల్‌తోపాటు హోంగార్డు, సిబ్బంది ఉండేవారని, తాను ఎటు వెళ్లినా తన వెంట ఎస్కార్ట్ ఉండేదని తెలిపారు. ప్రస్తుత సీఐ తన భద్రత తగ్గించారని ఆవేదన వ్యక్తం చేశారు. జాన్సన్‌నాయక్‌కు ఏ హోదా ఉందని ఎస్కార్ట్ ఇస్తున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

రెబల్‌గా పోటీ చేస్తా

తాను వచ్చే ఎన్నికల్లో ఖానాపూర్ నుంచి బీఆర్‌ఎస్ పార్టీ రెబల్ అభ్యర్థిగానే పోటీ చేస్తానని మరోసారి స్పష్టం చేశారు. ఖానాపూర్ మున్సిపాలిటీ, కొత్త మండలాలు తన హయాంలోనే చేశానన్నారు. రూ.5 కోట్లు కడెం ప్రాజెక్టు రిపేరుకు వచ్చాయని, ఆ నిధులు ఎటు వెళ్లాయో తెలియదన్నారు. జాన్సన్ నాయక్ ఓటమే తన లక్ష్యమని స్పష్టం చేశారు.

సిక్కిం నుంచి పొన్కల్‌కు..

- 8 ఏళ్ల తర్వాత ఇంటికి వచ్చిన మహిళ
- కుటుంబ సభ్యులకు అప్పగించిన సేవా సంస్థ సభ్యులు


పొన్కల్‌లో కుటుంబ సభ్యులతో బుచ్చవ్వ

మామడ: అయిన వారిని మర్చిపోతున్న ఈ రోజుల్లో మతస్థిమితం లేని మహిళను వృద్ధాశ్రమంలో చేర్చుకోవడంతోపాటు ఏళ్లుగా సేవ చేశారు. ఆచూకి తెలుసుకుని 8 ఏళ్ల తర్వాత కుటుంబ సభ్యులకు మంగళవారం అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే.. మామడ మండలం పొన్కల్ గ్రామానికి చెందిన రాజారపు నడిపి బుచ్చవ్వకు కొన్నేళ్లుగా మతస్థిమితం సరిగా ఉండటం లేదు. 2015 సంవత్సరంలో ఇంటినుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు సమీపంలోని ప్రదేశాలలో వెతికారు. తెలిసిన వారిని అడిగారు. జాడమాత్రం దొరకలేదు.

సిక్కిం టూర్‌తో వెలుగులోకి.....

నల్గొండకు చెందిన స్వచ్ఛంద సేవాసంస్థ సభ్యుడు అఖిల్ తన మిత్రులతో కలిసి గత నెలలో ఈశాన్య రాష్ట్రాల సందర్శనకు వెళ్లాడు. ఈ క్రమంలో సిక్కిం రాష్ట్రంలో పర్యటించారు. అక్కడ వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. అక్కడ ఉన్న బుచ్చవ్వ తెలుగులో మాట్లాడగా వివరాలు సేకరించి తన మిత్రులకు సమాచారం అందించారు. దీంతో ఫోన్ ద్వారా ఫొటోలు పంపించగా కుటుంబ సభ్యులు బుచ్చవ్వను గుర్తించారు. బుచ్చవ్వను స్వగ్రామానికి చేర్చాలని వృద్ధాశ్రమ నిర్వాహకులను వేడుకోగా వారు స్పందించారు.

ఎనిమిదేళ్ల తర్వాత స్వగ్రామానికి....

1800 కిలోమీటర్‌లకు పైగా దూరంలో ఉన్న సిక్కిం రాష్ట్రం నుంచి స్వచ్ఛంద సంస్థ సభ్యురాలు బెనితా బుజాల్ ఆధ్వర్యంలో సిక్కింలో వృద్ధాశ్రమ నిర్వాహకుడు పసంగ్‌కిట్‌తోపాటు నల్గొండకు చెందిన స్వచ్ఛంద సంస్థ సభ్యుడు అఖిల్ ఆరు రోజులు ప్రయాణించి బుచ్చవ్వను స్వగ్రామం పొన్కల్‌కు తీసుకువచ్చారు. గ్రామస్తుల సమక్షంలో కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కుటుంబ సభ్యుల ఆనందం..

ఎనిమిదేళ్ల తర్వాత బుచ్చవ్వ ఇంటికి రావడంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ఇక లేదనుకున్న బుచ్చవ్వ ఆచూకీ లభించడంతో యోగక్షేమాలు తెలుసుకుని హర్షం వ్యక్తం చేశారు. స్వచ్ఛంద సంస్థ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.